క్లుప్తంగా

సొసైటీల్లో రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం



ఖానాపురం : సొసైటీల్లో రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి నాయక్ తెలిపారు. సహకార వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. సొసైటీల ఆధ్వర్యంలో రైతులకు పలు రకాల సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు రుణాలు అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీఈఓ ఆంజనేయులు, వైస్ చైర్మన్ వేణు కృష్ణ, డైరెక్టర్లు సునీత, కుమారస్వామి, అచ్యుతం, రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



చెన్నారావుపేట : విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టంతో కష్టపడి చదవాలని మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో స్ఫూర్తి మోటివేషన్ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు దేశం గర్వించే స్థాయికి ఎదిగిన శాస్త్రవేత్తలు, ఇతర వ్యక్తుల స్ఫూర్తితో ఎదగాలని ఆకాంక్షించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ గ్రేడ్ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నల్ల శ్రీవాణి, ఎంపీఓ శ్రీధర్ రాజు, ఉపాధ్యాయులు కిశోర్, రవి, ఉమాదేవి, రజిని, అనుమమ, శ్రీనివాస్‌రెడ్డి, కౌశిక్, మంజుల, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



చెన్నారావుపేట : స్థానిక సొసైటీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తొగరు చెన్నారెడ్డి అతడి తల్లిదండ్రులు విజయ గోవర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం పంపించిన క్రీడాసామగ్రిని మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ నాయకుడు మంద నరేశ్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగోతు శౌరీలు, పంచాయతీ కార్యదర్శి మమత, నాయకులు కొమ్ముల కిరణ్, మినుముల నరేశ్, మొలుగూరి భాను, మహద్, రజాక్, మోతె ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ కార్యాలయ మార్పు



సంగెం : మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని రైతు వేదికలోకి మార్చినట్లు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) యాకయ్య తెలిపారు. రైతు వేదికలోని కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పాత వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుని స్లాబ్‌కు పెచ్చులూడుతున్నాయని చెప్పారు. వర్షం కురిస్తే ఫైళ్లు తడుస్తున్నాయని తెలిపారు. ఇక నుంచి రైతు వేదికలో కార్యాలయం కొనసాగుతుందన్నారు. రైతులు, ప్రజలు గమనించాలని కోరారు. సమావేశంలో ఏఈఓలు సాగర్, రాజేందర్, కార్తీక్, సరిత, లావణ్య పాల్గొన్నారు.

కేసు నమోదు

వర్ధన్నపేట : మండలంలోని బండౌతాపురం గ్రామానికి చెందిన నక్క మల్లయ్య అతడి పక్క భూమికి చెందిన వ్యక్తుల దాడి వల్లే అతడి కూతురు రజిత మృతి చెందిందంటూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మల్లయ్య కూతురు రజిత అనారోగ్యానికి గురై ఈనెల 5న హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చేరి చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యి ఇంటికి చేరుకోగా ఈనెల 12న మృతి చెందింది. కాగా ఈ ఏడాది మార్చి 19న తాము వ్యవసాయ భూమిలో పనులు చేసుకుంటుండగా పక్కన భూమికి చెందిన నక్క బాలరాజు, సురేందర్, రజిత, తదితరులు తమపై రాళ్ల దాడి చేశారని మల్లయ్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. రజిత మృతదేహానికి పోస్టుమార్టం చేయించి న్యాయం చేయాలని మల్లయ్య కోరినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నర్సంపేట : నెహ్రూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



నర్సంపేట : బాలల దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఘనంగా బాలల దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్ : మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 135వ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నెక్కొండ, సంగెం, గీసుకొండ, నల్లబెల్లి, ఖానాపురం, చెన్నారావుపేట, దుగ్గొండి, రాయపర్తి, తదితర మండలాల్లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణాల్లో, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో, కళాశాలల్లో, పాఠశాలల్లో, పలు చోట్ల నెహ్రూ చిత్రపటానికి నాయకులు, విద్యార్థులు, ప్రజలు నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను మరిపించేలా స్వయంగా తరగతులు బోధించి ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో, ఆటపాటలతో అలరించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, తదితర పోటీలు నిర్వహించారు.



నర్సంపేట రూరల్ : మాదన్నపేట హైస్కూల్‌లో..



వర్ధన్నపేటలో..



నెక్కొండలో..



నల్లబెల్లి హైస్కూల్‌లో..



గీసుకొండ : గంగదేవిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో..



ఖానాపురం : దబ్బీర్‌పేటలో..



దుగ్గొండి: సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు



రాయపర్తి : కాట్రపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో



చెన్నారావుపేట : కేజీబీవీలో..

మధుమేహ బాధితులకు ఉచిత సేవలు

నర్సంపేట : మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా ఉచితంగా వైద్యపరీక్షలు, ఇతర సేవలు అందిస్తున్నట్లు ప్రముఖ వైద్యుడు లెక్కల విద్యాసాగర్ రెడ్డి కోరారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పవన్ నర్సింగ్ హోంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పలువురికి 15 రకాల పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి మాట్లాడారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఆర్నెళ్లకోసారి గుండె, కంటి, కిడ్నీ, నరాలు, కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రపంచంలో ప్రతి నలుగురిలో ఒకరికి డయాబెటిస్ నిర్ధారణ అవుతోందని చెప్పారు. గ్రామీణుల్లోనూ



మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

ప్రబలుతోందని ఆందోళన వెలిబుచ్చారు. సరైన ఆహార అలవాట్లు లేకపోవడం, వ్యాయమం చేయకపోవడం మధుమేహం బారిన పడడానికి ప్రధాన కారణాలని తెలిపారు. నర్సింగ్ హోం ఆధ్వర్యంలో ప్రతినెలా శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

ముళ్లపొదల తొలగింపు



సంగెం : రోడ్డు ప్రమాదాలు జరగకుండా స్థానిక పోలీసులు చొరవ తీసుకున్నారు. ముళ్లపొదలు తొలగించి ఔదార్యం చాటారు. వివరాలిలా.. మండలంలోని వరంగల్–మహబూబాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగి కొంత కాలంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో సమస్యను గుర్తించిన ఎస్సై నరేశ్ మండలంలోని ఆశాలపల్లి–గవిచర్ల పరిధిలోని వరంగల్–మహబూబాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను, ముళ్లపొదలను డోజరుతో గురువారం తొలగింపజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొల్లెబోయిన కిశోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చలికాలం నిమోనియాతో జాగ్రత్త



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సరోజ

చెన్నారావుపేట : చలికాలంలో చిన్న పిల్లలు నిమోనియాతో జాగ్రత్తగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు సరోజ కోరారు. మండలంలోని సూరిపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చిన్న పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ సరోజ మాట్లాడారు. చిన్న పిల్లలకు చల్లని పదార్థాలు తినిపించకూడదని, చల్లటి పానియాలు తాగించకూడదని తల్లిదండ్రులకు సూచించారు. చలికాలంలో ఉదయం, సాయంత్రం గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్న సయమంలో పిల్లలు బయట తిరగకుండా చూడాలని చెప్పారు. బయటికి వెళ్లినప్పుడు మూతికి, ముక్కుకు మాస్క్ లేదా తెల్లని రుమాలు కట్టాలన్నారు. దగ్గు, జ్వరం, ఆయాసంతో బాధపడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కీర్య, సెకెండ్ ఏఎన్ఎం సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, నిర్మల, సాంబలక్ష్మి, పూలమ్మ, ఆశ కార్యకర్తలు కరుణ, హైమ, అరుణ, శ్రీలత పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పథకాల అమలు



దుగ్గొండి : రాజకీయాలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నాచినపల్లికి చెందిన వడ్డెపల్లి సారంగం, దేవులపల్లి రమేశ్, కొలువుల స్వామి, కొమ్మెర మొగిల్లయ్యలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా వాటిని గురువారం ఆయన అందజేసి మాట్లాడారు. అర్హులందరికీ పథకాలు అమలయ్యే దిశగా చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగరబోయిన చిన్న నర్సయ్య, గుడిపెల్లి ధర్మారెడ్డి, శ్రీరామోజు ప్రభాకర్, పుచ్చకాయల బుచ్చిరెడ్డి, మాదాసి సాంబయ్య, మట్ట పెద్ద రమేశ్, భరత్‌రెడ్డి, కంచరకుంట్ల నర్సింహారెడ్డి, గోవిందు మురారి, ఓరుగంటి తిరుపతి, జటబోయిన సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో పిల్లల దంత సంరక్షణ

వర్ధన్నపేట : అవగాహనతో పిల్లల దంత సంరక్షణకు కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ దంత వైద్య నిపుణురాలు అపర్ణ తెలిపారు. ఆస్పత్రి దంత వైద్య విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన డెంటల్ స్క్రీనింగ్ శిబిరాన్ని ఆర్ఎంఓ డాక్టర్ విజయ్ ప్రారంభించారు. అనంతరం డాక్టర్ అపర్ణ మాట్లాడారు. పాల దంతాల వ్యాధులను గుర్తించడం ద్వారా శాశ్వత దంతాలను కాపాడవచ్చని చెప్పారు. విద్యార్థి దశలోనే దంత సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. డాక్టర్ భరత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దంత వైద్య పరీక్షలు చేయించుకునేలా చైతన్యవంతం చేయాలని ఆకాంక్షించారు. బాలల వైద్య నిపుణులు డాక్టర్ శైలజ మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు పౌష్టి




పిల్లలకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాహారం అలవర్చాలని చెప్పారు. పిల్లల్లో పిప్పళ్లు, పాల పళ్లు, చిగుళ్ల సమస్యలను గుర్తించి ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. అలాగే గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయులు రాజకుమారి, అనిత, రహీమ్, శ్రీనివాస్, సురేశ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

'మాదిగలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు సరికాదు'

పర్వతగిరి : ఎస్సీ వర్గీకరణపై మాదిగలకు వ్యతిరేకంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ అన్నారు. మండల కేంద్రంలో జిల్లా ధర్మయ్య అధ్యక్షతన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా బర్ల యాకయ్య, అధికార ప్రతినిధి జిల్లా ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మచ్చ రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా జిల్లా రవి, యువసేన మండల అధ్యక్షుడిగా అనిల్ ఎన్నికయ్యారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



భాస్కర్‌రెడ్డి (ఫైల్)

దుగ్గొండి : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాలిలా.. మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన గోగుల భాస్కర్‌రెడ్డి (38) ఈనెల 2న ఇంట్లోని గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు వరంగల్‌లోని ఎంజీఎంలో చేర్చగా గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలి

పర్వతగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఎంఆర్‌సీలో ఎంఈఓకు గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం ప్రశాంత్ మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సరికాదన్నారు. జిల్లా, మండల స్థాయిలో విద్యాశాఖ అధికారుల పని తీరు మందగించిందని చెప్పారు. ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ పాఠశాలల్లోని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, సురేశ్, రత్నాకర్, దివాకర్, సాయి, మధు, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

వర్ధన్నపేట : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ తెలిపారు. మండలంలోని బొక్కలగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులకు లబ్ధి చేకూర్చేలా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ అందజేస్తోందని చెప్పారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటయ్య

మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలతిరెడ్డి, నాయకులు పోశాల వెంకన్న, చోటే, మల్లెపాక సమ్మయ్య, కుల్ల యాకాంతం, ఏపీఎం వేణు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని బూత్‌ల్లో సభ్యత్వాలు చేయించాలి



సంగెం : మాట్లాడుతున్న డాక్టర్ కాళీప్రసాదరావు



నల్లబెల్లి : మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

సంగెం : మండలంలోని అన్ని గ్రామాలు, తండాల్లోని అన్ని బూత్‌ల్లో ఆన్‌లైన్‌లో సభ్యత్వాలు చేయించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశలంఓ ఆయన మాట్లాడారు. ఒక్కో బూత్ నుంచి 200కు తగ్గకుండా సభ్యత్వాలు చేయించాలని, స్థానిక సంస్థ ఎన్నికలే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కూతురు రాజు, మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, నాయకులు దేవేందర్‌రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు క్రియాశీలకంగా పని చేయాలి

నల్లబెల్లి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు క్రియాశీలకంగా పని చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదులో పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి శాలువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జ్ శ్రీనివాస్, నాయకులు కంభంపాటి పుల్లారావు, నాయకులు కట్ల రామచంద్రారెడ్డి, పంజాల రాము, అచ్చ దరాయకర్, బొచ్చు వెంకటేశ్వర్లు, తడుక వినయ్, పల్లె పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయండి

దుగ్గొండి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రామాల్లో పార్టీని సమాయత్తం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాపరెడ్డి కోరారు. మండలంలోని వెంకటాపురంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నేదురు రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతను సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా బరిలోకి దించి కొత్త తరం రాజకీయాలకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం ఆంజనేయులు, కంభంపాటి పుల్లారావు, కట్ల రాంచంద్రారెడ్డి, మొకిడె ప్రభాకర్, చెల్పూరి రాజు, పంజాల రాము, అచ్చ దయాకర్, శ్రీను, శశిధర్‌రెడ్డి, కర్ణాకర్, లింగయ్య, నూతనకంటి శ్రీనివాస్, బొమ్మగాని రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్‌తో ఎన్నికలపై అవగాహన

ఖానాపురం : మాక్ పోలింగ్‌తో ఎన్నికలపై అవగాహన కలుగుతుందని ఎస్సై రఘుపతి తెలిపారు. మండలంలోని బుధరావుపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌లో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించగా ఆయన హాజరై పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవచ్చని చెప్పారు. నచ్చిన వారికి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఓటుతో సమాజాన్ని మెరుగుపర్చుకోవాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో పలువురు విద్యార్థులు పాల్గొనగా గెలిచిన వారిని



మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్సై రఘుపతి

అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, ఉపాధ్యాయులు భద్రయ్య, షహనాజ్ బేగం, సారంగపాణి, సురేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికి తీసేలా పోటీలు



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నర్సంపేట : విద్యార్థుల్లో ప్రతిభ వెలికి తీసేలా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు డాక్టర్ మోహన్‌రావు తెలిపారు. పట్టణంలోని ట్రస్ట్ (సంజీవని ఆశ్రమం)లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు బాలల హక్కుల పరిరక్షణపై చిత్రలేఖనం, పర్యావరణ పరిరక్షణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం మోహన్‌రావు మాట్లాడారు. విజేతలకు ఈనెల 19న ఆశ్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు విమల మోహన్‌రావు, రిటైర్డ్ టీచర్ కుసుమ భద్రయ్య, స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'కొనుగోళ్లు ప్రారంభించక పోవడం సరికాదు'

వర్ధన్నపేట : కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 10 రోజులు గడచినా ధాన్యం కొనుగోళ్లు మొదలు పెట్టకపోవడం సరికాదని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు అన్నారు. పట్టణంలో మీడియాతో గురువారం ఆయన మాట్లాడారు. ధాన్యం తీసుకొచ్చి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినా ప్రభుత్వం కొనకపోతుండడంతో దళారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్న దుస్థితి నెలకొందని ఆందోళన వెలబుచ్చారు. ఇకనైనా వెంటనే కొనుగోళ్లు మొదలు పెట్టడంతోపాటు దొడ్డు రకానికి సైతం మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'కొర్రీలతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు'

దుగ్గొండి : ధాన్యం కొనుగోలులో కొర్రీలతో రైతులను ఇబ్బంది పెట్టొదని ఏఓ మాధవి, ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని మందపల్లి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని గురువారం వారు సందర్శించారు. ఎంత మంది రైతులు, ఎన్ని క్వింటాళ్ల ధాన్యాన్ని తీసుకొచ్చారు, కొనుగోళ్లు ఎలా ఉన్నాయి? అనే అంశాలపై పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, తాలు లేకుండా తూర్పార బట్టి కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు చేసిన మూడ్రోజుల్లో మద్దతు ధర రూ.2320తోపాటు రూ.500 బోనస్ కలిపి రైతుల ఖాతాలలో జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గుడిపెల్లి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ సింగతి కార్తీక్, ఏఈఓలు రాజేశ్, వైజయంతి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

సంగెం : తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ఎలిపారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌లపై దాడికి పాల్పడడాన్ని ఖండించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు శారద, బాలాజీ, వీఆర్ఏలు నరేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన వాంకుడోతు నంద, బాగాది సాంబయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.5 వేల చొప్పున అందజేశారు. ఆయన పంపించిన డబ్బును బాధిత కుటుంబాలకు ఆ పార్టీ నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు జన్ను రమేశ్, నాయకులు భద్రు, దునికి కొమురయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'బ్యాండ్' ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

గీసుకొండ : బ్యాండ్ కళాకారుల సంక్షేమం కోసం ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం నాయకులు గుమ్మడి రాజు, నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద జిల్లా, నర్సంపేట డివిజన్ సంఘాల ప్రతినిధులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం దొడ్డిపెల్లి భిక్షపతి, చాంద్ పాషా, మద్దికాయల యాదగిరి, మడిపెద్ది వెంకన్న, వెండి బాబు, పాడేటి రాజుతో జిల్లా అడ్‌హక్ కమిటీ ప్రకటించారు.